గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలి

► రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 5 ,(ప్రజాజ్యోతి)గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కోసం అందిన ఫారం-18 దరఖాస్తుల పరిశీలనప్రక్రియను వేగవంతం చేసి, రాబోయే 15 రోజుల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా రూపకల్పన, ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్

మిగతా 2 లో... ►

జాతీయ తెలుగు దినపత్రిక


ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 6 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 10

- డాక్టర్ స్లిప్ లేకుండానే టాబ్లెట్లు దందా...
- అర్హత లేని వారి చేతిలో ప్రజల ప్రాణాలు
- ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు..!
- ప్రిస్క్రిప్షన్ లేకపోయినా పర్లేదు... డబ్బుంటే చాలు... మందుల షాపుల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- వైద్యాధికారుల నిర్ర రోగుల పాలిట శాపంగా మారిన నకిలీ మందుల దందా..!
- ఏ కంపెనీ మందో తెలియదు, ఏ డోసో తెలియదు అయినా అంటగడుతున్న మెడికల్ షాపులు...
- మందుల వ్యాపారం ప్రజల ప్రాణాలను తీస్తోందా...?



మణుగూరులో... మెడికల్ కార్టెల్..!

6 లో..

డాక్టర్ రాసిన చీటీ లేకుండానే మందులు అమ్మే దందా మణుగూరు మండలంలో రెచ్చిపోతోంది. అర్హత లేని కొందరు వ్యక్తులు సైతం మెడికల్ షాపులు తెరిచి డాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. లైసెన్స్ ఒకరిదైతే షాపు నడిపేది మరొకరు కావడం ఇక్కడ సర్వసాధారణమైపోయింది. రకరకాల కంపెనీల మందులు తెప్పించి రోగం ఏమిటో తెలియకుండానే రోగులకు అంటగడుతున్నారు. కొందరు వ్యాపారులు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి ప్రమాదకర మందులను సైతం ఇష్టానుసారం అమ్మేస్తున్నారు. దీంతో చిన్న జ్వరానికి వెళ్లిన రోగి పెద్ద జబ్బుతో తిరిగి వస్తున్న దుస్థితి నెలకొంది. నిబంధనలు కాగితాలకే పరిమితం కాగా, జిల్లా వైద్యాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

● మణుగూరు, ప్రజాజ్యోతి

వీబీ-జి రామ్ జి పథకం ద్వారా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి

♦ రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి: మంత్రి తుమ్మల



కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 5, (ప్రజా జ్యోతి) కొత్తగూడెం జిల్లాలో వీబీ-జి రామ్ జి పథకం ద్వారా తాత్కాలిక పనులకు బదులుగా ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్రానికి మోడల్గా నిలవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మురసు తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలు, రహదారులు, కల్వర్టులు, వంతెనలు, విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించాలని, రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్తో కలిసి వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. వీబీ-జి రామ్ జి పథకం కింద ప్రస్తుతం అందుబాటులో ఉన్న 375 రకాల పనులను సద్వినియోగం చేసుకొని శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి తెలిపారు. చెరువులు, పంట కాలువల పూడికతీత, చెరువు కట్టల పటిష్టత, గ్రామీణ అంతర్గత రహదారులు

మిగతా 2 లో... ►

మావోయిస్టుల భారీ డంప్ గుర్తింపు

- 711 బీజీఎల్ సెల్స్ స్వాధీనం



2 లో... ►

మురసు తుఫాన్ బీభత్సం.. రంగంలోకి మంత్రి పొంగులేటి!

- దమ్మపేటలో మురసు తుఫాన్ నష్టంపై మంత్రి ఆరా
- వరదలకు దెబ్బతిన్న చెరువులు, వాగులు, రహదారులు, పంట పొలాల పరిశీలన
- రైతులకు, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది..
- నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి తక్షణ చర్యలు చేపట్టాలి
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి పర్యటన.. అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు



దమ్మపేట, నవంబర్ 05 (ప్రజా జ్యోతి): మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దమ్మపేట మండలంలో దెబ్బతిన్న చెరువులు, వాగులు, రహదారులు, పంట పొలాలను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో

మిగతా 2 లో... ►

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదులో భాగంగా అందిన ఫారం–18 దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత 15 రోజుల గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన గ్రాడ్యుయేట్ల పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా అన్ని జిల్లాల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా విద్యార్థులు, యువతకు ఓటు హక్కు, ఓటరు నమోదు విధానం, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం అందిన ఫారం–18 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులపై నిబంధనల ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్దేశించిన విధంగా 15 రోజుల్లోగా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, ఇందుకోసం సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టి, విద్యార్థులు, యువతకు ఓటు హక్కు, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండ్ రంగ ప్రసాద్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మావోయిస్టుల భారీ డంప్ గుర్తింపు

► 711 బీజీఎల్ సెల్స్ స్వాధీనం



చర్ల, నవంబర్ 05: (ప్రజా జ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని తాడపాల ఎఫ్ఓబీ సమీప అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టులు దాచిపెట్టిన 711 బీజీఎల్ (బారెల్ గ్రెనేడ్ లాంచర్) సెల్స్‌ను భద్రతా బలగాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ 196వ బెటాలియన్, 204 కోబ్రా బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందం గాలింపు చర్యలు చేపట్టింది. నవంబర్ 5న ఉసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడపాల ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్ఓబీ)కు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ క్రమంలో తాడపాల ఎఫ్ఓబీకి వాయువ్య దిశలో సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీ హిల్స్ సమీపంలో మావోయిస్టులు దాచిపెట్టిన 711 బీజీఎల్ సెల్స్‌ను గుర్తించారు. భద్రతా ప్రోటోకాల్స్ ప్రకారం వాటిని సురక్షితంగా స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు.

పౌరులకు పోలీసుల విజ్ఞప్తి:

కర్రెగుట్ట పరిసర కొండ ప్రాంతాల్లో ల్యాండ్‌మైన్‌లు (ఐఈడీలు), ఇతర పేలుడు పదార్థాలు ఉండే ప్రమాదం ఉన్నందున పౌరులు ప్రస్తుతం ఆ ప్రాంతాలకు వెళ్లవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా అటవీ, కొండ ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్ధారిత కార్యాచరణ ప్రణాళిక ప్రకారం భవిష్యత్తులో మైన్‌ల తొలగింపు చర్యలు చేపడతామని భద్రతా బలగాలు వెల్లడించాయి.

వీబీ-జి రామ్ జి పథకం ద్వారా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గాలు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల అదనపు తరగతి గదులు, అసంపూర్తి భవన నిర్మాణాలను ఈ పథకం కింద ప్రతిపాదించాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ప్రయోజనం కలిగించే పనులకు మొదటిప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు .పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన అర్హమైన పనులను కూడా వీబీ – జి రామ్ జి పథకం కింద ప్రతిపాదించాలని మంత్రి సూచించారు. రహదారుల మరమ్మతులు, మెటలింగ్, కల్వర్టులు, వంతెనలు, కాలువల పునరుద్ధరణ, అసంపూర్తి పనులను గుర్తించి కలెక్టర్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. పనుల మంజూరు కోసం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. మురసు తుపాను కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంటలు, రహదారులు, కల్వర్టులు, వంతెనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంట నష్టాలను నిబంధనల ప్రకారం నమోదు చేయడంతో పాటు దెబ్బతిన్న మౌలిక సదుపాయాలకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ములకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో వర్షాల ప్రభావం అధికంగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దెబ్బతిన్న రహదారులకు శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని, అవసరమైన చోట గేబియన్ నిర్మాణాలు చేపట్టే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 56 ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, ఇతర నిర్మాణాల పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భద్రాచలం–వెంకటాపురం రహదారి అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని, టెండర్ ప్రక్రియ పూర్తయినందున వెంటనే జీఎస్‌బీ పనులు ప్రారంభించాలని మంత్రి సూచించారు. ఇసుక రవాణా కారణంగా రహదారి దెబ్బతినకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. మల్లెపువ్వుల వాగు పరిధిలోని ప్రాంతాల్లో నీటిప్రవాహానికి అడ్డుగా ఉన్న కంపను తొలగించి, పంట పొలాలకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి పంట కాలంలో తాత్కాలిక పనులు చేపట్టి తొలగించే పరిస్థితి లేకుండా శాశ్వత ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు అభివృద్ధి పనుల కోసం విడుదలైన రూ.70 లక్షలతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు, గంగారం ప్రాంతంలోని నీటి వనరులు, కాలువల అభివృద్ధి, అవసరమైన చోట చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని మంత్రి ఆదేశించారు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వద్ద ప్రస్తుతం 36 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్న నేపథ్యంలో ఇసుక బస్తాలతో చేపట్టిన రక్షణ ఏర్పాట్లను పరిస్థితులకు అనుగుణంగా కొనసాగించాలని మంత్రి సూచించారు. యాతాల కుంట టర్నల్ లైనింగ్ పనులు మరో వారంలో పూర్తయ్యే అవకాశం ఉన్నందున ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న జనవరి నుంచి కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, వ్యవసాయ రంగాలకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. గత సంవత్సరాల వర్షపాతం, సెంట్రల్ వాటర్ కమిషన్ సమాచారం ఆధారంగా పరిస్థితులను అంచనా వేయాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని, వరి, చెరకు వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అన్నారు .ములకలపల్లి, చంద్రుగొండ, రెడ్డిపల్లి ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నందున మొక్కల సరఫరా, సాగు విస్తరణకు ఉద్యానవన శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి, మెట్ట పంటలతో పాటు జనుము, పిల్లిపెసర వంటి పశుగ్రాస పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలో విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూమి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, భద్రాచలం, జూలూరుపాడు పట్టణాల్లో ప్రధాన రహదారుల మధ్య డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని మంత్రి సూచించారు. జిల్లాలోని పట్టణాలు పచ్చదనంతో, పరిశుభ్రంగా, సుందరంగా కనిపించేలా మొక్కలు నాటి వాటిని నిరంతరం సంరక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పనుల నాణ్యత, మన్నికకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , కొత్తగూడెం ఆర్డీవో మధు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డిసిహెచ్ఓ రవిబాబు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మురసు తుఫాన్ బీభత్సం.. రంగంలోకి మంత్రి పొంగులేటి!

(మొదటి పేజీ తరువాయి...)

పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించారు. ప్రకృతి విపత్తు కారణంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మురసు తుఫాన్ కారణంగా దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లి చెరువులు, రహదారులు, వ్యవసాయ భూములు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, అధికారులతో కలిసి ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరదల తీవ్రత, జరిగిన నష్టాన్ని పరిశీలించారు. పంట పొలాల్లోకి చేరిన వరద నీరు, దెబ్బతిన్న నీటి ప్రవాహ మార్గాలు, రహదారుల పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతులకు అండగా ఉంటాం.. నష్టపరిహారం అందేలా చర్యలు

వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేయాలని అధికారులకు సూచించారు. నష్టపోయిన ప్రతి ప్రాంతాన్ని పరిశీలించి పూర్తి వివరాలతో నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతులు, బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దెబ్బతిన్న రహదారులకు తక్షణ మరమ్మతులు చేపట్టాలి

వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. చెరువులు, కాలువలు, వాగులు, నీటి ప్రవాహ మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ సహాయక చర్యలు అందించాలని, ప్రజా జీవనం సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతులు మరింత నష్టపోకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు అభినందనలు

దమ్మపేట మండల పర్యటనకు ముందు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి సత్తుపల్లి నియోజకవర్గంలోని బేతుపల్లి చెరువును సందర్శించారు. చేపల వేటకు వెళ్లి వరదలో చిక్కుకున్న జాలర్లను రక్షించేందుకు వెళ్లిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల పడవలు ప్రమాదానికి గురైన ఘటనలో సహాయక చర్యలు చేపట్టి 11 మంది పోలీసులను సురక్షితంగా కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అభినందించారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు, దమ్మపేట తహసీల్దార్ (డిప్యూటీ కలెక్టర్) మద్దినేని మురళి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించడం అభినందనీయం

సహాయక చర్యలు చేపట్టిన ప్రత్యేక బృందాలను ప్రశంసించిన మంత్రి పొంగులేటి

- సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం
- వరద నష్టంపై సమగ్ర నివేదికలు అందజేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 5, (ప్రజా జ్యోతి)

మురసు తుపాను ప్రభావంతో కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఏర్పడిన వరద పరిస్థితులు,జరిగిన నష్టం,చేపట్టిన సహాయక చర్యలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాలశాఖమంత్రిపొంగులేటిశ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు.అనంతరం సత్తుపల్లిలోని సింగరేణి అతిథి గృహంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ముందుగా మంత్రి సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్దకు వెళ్లి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపట్టిన సహాయక చర్యలను పరిశీలించారు. ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు మత్స్యకారులను సురక్షితంగా రక్షించడంలో కీలకపాత్రపోషించిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీ, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీస్, అగ్నిమాపక శాఖల సిబ్బందిని అభినందించారు.దమ్మపేట లో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న అలుగు ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సత్తుపల్లిలో తుపాను ప్రభావంతో ముంపునకు గురైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, గత 24 గంటల్లో కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాలతో పాటు ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఏర్పడిన పరిస్థితులు, జరిగిన నష్టంపై సమీక్షించినట్లు తెలిపారు.వరదల్లో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సైతం ప్రమాదంలో చిక్కుకున్నప్పటికీ, అధికారులు, ప్రజాప్రతినిధులు, సహాయక బృందాలు రాత్రంతా అవిశ్రాంతంగా శ్రమించి అందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారని తెలిపారు. ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా సహాయక చర్యలను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. గతంలో వరదల సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డీఆర్‌ఎఫ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసిందని మంత్రి వివరించారు.పోలీస్ శాఖ నుంచి 1,200 మంది, అగ్నిమాపక శాఖ నుంచి 700 మందిని ఎంపిక చేసి మొత్తం 1,900 మందికి ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు సుమారు రూ. 260 నుంచి రూ. 270 కోట్ల వ్యయంతో ఆధునిక రెస్క్యూ పరికరాలను సమకూర్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా విపత్తు సంభవించినప్పుడు 45 నుంచి 50 నిమిషాల్లో సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకునేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈసారి కూడా ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ఆధునిక పరికరాలు,సాంకేతిక పరిజ్ఞానాన్నివినియోగిస్తూ సమన్వయంతో పనిచేసి విలువైన ప్రాణాలను కాపాడాయని ప్రశంసించారు.భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో మైనర్ ఇరిగేషన్ చెరువులకు గండ్లు పడ్డాయని, కొన్ని చెరువుల కట్టలు తెగిపోగా, మరికొన్ని చెరువులు పొంగిపొర్లడంతో కట్టలు దెబ్బతిన్నాయని తెలిపారు. మల్లెపూవు వాగు ఉధృతంగా ప్రవహించడంతో దిగువ ప్రాంతాల్లో వరి తదితర పంటలు దెబ్బతిన్నాయని, వాగుకు ఇరువైపులా సుమారు 200 నుంచి 300 మీటర్ల పరిధిలో పంట నష్టం జరిగినట్లు వివరించారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారులు, వంతెనలు, విద్యుత్ వ్యవస్థలు కూడా పలు ప్రాంతాల్లో దెబ్బతిన్నాయని తెలిపారు. రెండు జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి వరద నష్టాన్ని వాస్తవికంగా అంచనా వేయాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పంట నష్టాన్ని సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, వ్యవసాయ, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర శాఖల అధికారులు తమ శాఖలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రెండు మూడు రోజుల్లో పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు, వరద సహాయక చర్యల్లో శ్రమించిన ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలర్ట్ హెచ్చరికల నేపథ్యంలో ముందుగానే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి వివిధ ప్రాంతాల్లో అధికారులను, సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.రెవెన్యూ,పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పోలీస్ తదితర శాఖల అధికారులను క్షేత్రస్థాయిలో మోహరించి గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టినట్లు వివరించారు.అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి లో భారీ వర్షాల కారణంగా పొలాలకు వెళ్లిన మహిళ, యువకుడు వరదల్లో చిక్కుకుని చెట్లపై ఆశ్రయం పొందగా, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు డ్రోన్లు, లైఫ్ జాకెట్లు, తాళ్ల సహాయంతో వారిని సురక్షితంగా రక్షించాయని వివరించారు. దమ్మపేటలో ఆలయ దర్శనానికి వెళ్లిన 11 మంది గిరిజనులు వరదల్లో చిక్కుకోగా వారిని కూడా సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 9 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించామని తెలిపారు.ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర మాట్లాడుతూ సత్తుపల్లి ప్రాంతంలో వరదల్లో చిక్కుకున్న మత్స్యకారులతో పాటు వారిని రక్షించేందుకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న సహాయక సిబ్బందిని కాపాడేందుకు చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ వివరాలను వెల్లడించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో పోలీస్, డీడీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. గత 30 గంటల్లో అశ్వారావుపేటలో అత్యధికంగా 411 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, దమ్మపేట, ములకలపల్లి సహా పలు ప్రాంతాల్లో 350 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురిసిందని వివరించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. డ్రోన్లు, మోటార్ బోట్లు, ఆధునిక పరికరాల సహాయంతో వరదల్లో చిక్కుకున్న వారి ఆచూకీ గుర్తించి ప్రణాళికాబద్ధంగా రక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు .

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు, వ్యవసాయ కూలీలు వరదల్లో చిక్కుకున్నప్పటికీ ఎస్‌డీఆర్‌ఎఫ్,ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సకాలంలో స్పందించి వారిని రక్షించాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోట్లను వినియోగించి వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా కాపాడటం అభినందనీయమన్నారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ అనూహ్యంగా సంభవించిన వరద విపత్తును జిల్లా యంత్రాంగం సమయస్ఫూర్తితో ఎదుర్కొందని తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలు, అధికారుల సమన్వయంతో రాత్రంతా సహాయక చర్యలు కొనసాగించి వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించడం అభినందనీయమన్నారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ కెప్టెన్ కిరణ్ మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న మత్స్యకారులతో పాటు ప్రమాదంలో చిక్కుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని రక్షించేందుకు ప్రత్యేక బృందాలను తరలించినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్, ఎస్పీ, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని చిక్కుకున్న వారిజియో కోఆర్డినేట్స్ ఆధారంగా రక్షణ ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు, ఈ సమావేశంలో భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, విద్యుత్ శాఖ ఎస్పీ మహేందర్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డిపిఓ అనూష, ఉమ్మడి ఖమ్మం జిల్లా సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







మణుగూరు పట్టణంలో గిన్నెలా వ్యాపారాల నిర్వహణ తీరుపై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నెలవారీగా డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ, ఆ వసూళ్లకు సంబంధించి పక్కా రశీదులు జారీ చేయడం లేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఏడాది అనంతరం అందజేస్తున్న సామగ్రి నాణ్యత, బరువు విషయంలోనూ స్పష్టత లేదని, చెల్లించిన మొత్తానికి తగిన విలువైన సరుకు లభించడం లేదని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో నిలిపివేసిన సభ్యులకు చెల్లించిన సొమ్ము తిరిగి చెల్లించడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యం లో గిన్నెలా వ్యాపారాలకు సంబంధించిన లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, జీఎస్టీ నిబంధనలు, తూకం-కొలతల అమలు తీరుపై సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గిన్నెలా షాపుల గోల్ మాల్ దందా..!

- రశీదు లేదు.. బిల్లు లేదు.. అయినా కోట్లలో వ్యాపారం, వసూళ్లు
- గిన్నెలా పేరుతో పేదల జేబుకు చిల్లు.. తనిఖీ చేయాలని పలువురు డిమాండ్
- నెలకు రూ.500 కడితే.ఏడాదికి మిగిలేది మోసమేనా..?
- గిన్నెలా షాపుల్లో అధికారుల తనిఖీలు ఎప్పుడు..?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. నవంబర్ 5, (ప్రజాజ్యోతి): –

మణుగూరు పట్టణంలో గిన్నెలా పేరిట సాగుతున్న నెలవారీ డబ్బు వసూళ్లపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయి. స్టీల్ సామగ్రి అందిస్తామని చెప్పి వసూలు చేస్తున్నసొమ్ముకు సరైన లెక్కలు లేవనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెల్లింపులకు రశీదులు ఇవ్వడం లేదని, అందజేస్తున్నసరుకు విలువపైస్పష్టత లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టిన సొమ్ముకు తగిన ప్రతిఫలం లభించడం లేదనే విమర్శలు ప్రతి ఇంట్లో వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమగ్ర తనిఖీలు చేపట్టాలని, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

›» జాడ లేని గిన్నెలా లెక్కలు

మణుగూరు పట్టణంలో గిన్నెలా పేరిట జరుగుతున్న నెలవారీ వసూళ్లకు సంబంధించి సరైన లెక్కలు లేవనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. స్టీల్ సామగ్రి అందజేస్తామనే హామీతో డబ్బులు సేకరిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. చెల్లింపుల వివరాలు, సభ్యుల జాబితా, పంపిణీ చేసిన సరుకు వివరాలు బహిర్గతం చేయడం లేదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. లెక్కల్లో పారదర్శకత లేకపోవడం వల్ల వినియోగదారుల్లో అనుమానాలు బలపడుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలనచేపట్టి వాస్తవాలను వెల్లడించాలని స్థానిక ప్రజానీకం డిమాండ్ చేస్తున్నారు. పరిశీలనలో నిబంధనల ఉల్లంఘన వెల్లడైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.



›» రశీదు లేని వసూళ్లు.. వినియోగదారుల ఆందోళన

గిన్నెలా పథకాల్లో చేరిన వారికి చెల్లింపులకు సంబంధించి పక్కా రశీదులు జారీ చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లిఖితపూర్వక ఆధారాలు లేకపోవడం వల్ల తమ సొమ్ముకు భద్రత లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేరే సమయంలో స్పష్టమైన ఒప్పంద పత్రాలు ఇవ్వడం లేదనే అభిప్రాయం కూడా ఉంది. సరుకు అందజేసే సమయంలో విలువ, నాణ్యత విషయంలో స్పష్టత లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ దృష్ట్యా ఈ అంశాలపై అధికారులు విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే వ్యాపారులకు కూడా న్యాయం జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

›» గిన్నెలా వ్యవహారంపై సంయుక్త తనిఖీకి డిమాండ్

గిన్నెలా వ్యాపారాల నిర్వహణ తీరుపై సంయుక్త తనిఖీలు చేపట్టాలని మణుగూరు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, పన్ను నిబంధనలు, తూకం–కొలతల అమలు తీరుపై పరిశీలన జరగాలని కోరుతున్నారు. చిట్ ఫండ్ తరహా వసూళ్లకు వర్తించే నిబంధనలు పాటించబడుతున్నాయా అనేది తనిఖీలో తేలాలని పలువురు పేర్కొంటున్నారు.అధికారులు స్వయంగా పరిశీలిస్తేనే అనుమానాలు నివృత్తి అవుతాయని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడం అధికారుల బాధ్యతని, వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. తనిఖీల ద్వారానే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీ మహిళలకు ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగ అవకాశాలు

- మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్
- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 5, (ప్రజా జ్యోతి) తెలంగాణ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్‌లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన మహిళలు ఈ ఉద్యోగాలకు అర్హులని, పదో తరగతి, ఇంటర్మీడియట్ లేదా నాన్‌టెక్నికల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అసెంబ్లీ హెల్పర్స్, వేర్‌హౌస్ ఆపరేషన్స్ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు.ఎంపికైన వారికి నెలకు రూ.20,283 స్థూల వేతనం, కోతల అనంతరం రూ.17,833 నికర వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అదనంగా రూ.1,500 వరకు హాజరు బోనస్, నెలకు రూ.2,000 చెల్లింపుతో వసతి, ప్రతిరోజూ రెండు ఉచిత భోజనాలు, ఏసీ బస్సు రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.రోజుకు ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని, వారానికి ఆరు రోజుల పని, ఒకరోజు సెలవు ఉంటుందని వివరించారు. నవంబర్ 6, 7 తేదీల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళలు అవసరమైన ధ్రువపత్రాలతో హైదరాబాద్ నాంపల్లి వద్ద గల మైనారిటీ స్టడీ సర్కిల్ నందు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8520860785, 6305385949 నంబర్లకు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని,placementdrive@tgmsccc.comకు ఈ–మెయిల్ చేయాలనిలేదా tgminoritiesstudycircle.telangana.gov.inవెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.





భద్రాద్రి డి.ఏ.వి హైస్కూల్ కు రాష్ట్రస్థాయి ఖ్యాతి

- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా భద్రాద్రి డి.ఏ.వి
- డి.ఏ.వి బృందం ప్రశంసలు.. చీఫ్ ఇంజనీర్ కు సన్మానం
- వచ్చే ఏడాది నుండి సి.బి.ఎస్.ఇ.. భద్రాద్రి పిల్లలు అదృష్టవంతులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. నవంబర్ 5, (ప్రజా జ్యోతి):-తెలంగాణ జెన్ కో పరిధిలోని భద్రాద్రి డి.ఏ.వి హైస్కూల్ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ టౌన్ షిప్‌లోని ఈ విద్యాలయాన్ని బుధవారం వివిధ డి.ఏ.వి విద్యాలయాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుల బృందం సందర్శించి, ఇక్కడి మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించింది. చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న సారథ్యంలో ఎస్.ఇ (సివిల్), ఎస్.ఇ (అడ్మిన్) పర్యవేక్షణలో నిర్మితమైన అత్యాధునిక భవనం, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, విశాలమైన ఆట స్థలం, పార్కింగ్ సౌకర్యాలను బృందం ప్రత్యేకంగా కొనియాడింది. దేశస్థాయిలో ఏ కార్పొరేట్ పాఠశాలకైనా దీటుగా ఉన్న ఇక్కడి ప్రమాణాలు అన్ని పాఠశాలలకు ఆదర్శమని పేర్కొంది. వచ్చే విద్యా సంవత్సరం నుండి సి.బి.ఎస్.ఇ సిలబస్ అమలు కానుండటంతో భద్రాద్రి ఉద్యోగుల పిల్లలు అదృష్టవంతులని బృందం అభిప్రాయపడింది. పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన చీఫ్ ఇంజనీర్ బిచ్చన్నకి బృంద సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు ధర్నా

- అంగన్వాడీ కేంద్రాల 10 నెలల పెండింగ్ అద్దెలు వెంటనే ఇవ్వాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 5,(ప్రజాజ్యోతి) అంగన్వాడీ కేంద్రాలకు చెల్లించాల్సిన పెండింగ్ ఇంటి అద్దెలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు, అనంతరం పళ్ళు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐసిడిఎస్ అధికారికి అందజేశారు, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ఇంటి అద్దెలు 10 నెలలుగా బకాయిలు ఉండటంతో ఇంటి యజమానులు ఇళ్ళు ఖాళీ చేయమని ఒత్తిడి తెస్తుండటం తో వడ్డీలకు తెచ్చి అద్దెలిస్తున్నారని అన్నారు, ఈ కారణంగా వారు వడ్డీభారం మోయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు ,ఫీడింగ్ నాణ్యమైన వి రావడం లేదని అవి కూడా 3,4 నెలలకు ఒకేసారి వేస్తున్నారని ,అవి కూడా ఎక్సపైరీ అవుతున్నాయి అని , కిచిడి చేసే రవ్వలో ఇసుక వస్తుందని, ఈ పుడ్డు తిన్న పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తే టీచర్లు బలిపశువులు అవుతారని ఆయన మండిపడ్డారు, నెలవారీ ప్రాజెక్టు మీటింగ్లు పెట్టకపోవడం, గ్రీవెన్సు కమిటీ లేకపోవడం వలన సమస్యలు చర్చించే అవకాశం లేకుండా పోతుందని, వెంటనే ప్రతినెలా ప్రాజెక్ట్ మీటింగ్ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు, నాణ్యమైన ఫీడింగ్ సరఫరా చేయాలని గ్యాస్ బిల్లులు, ఆరోగ్యలక్ష్మి బిల్లులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె సత్య, వి అచ్చమ్మ, పి పద్మ, భాను, నాగమణి, వెంకటరమణ, రామలక్ష్మి, చుక్కమ్మ, లక్ష్మీ, ఉమ, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.



మురసు తుఫాన్ నష్టాలపై సమగ్ర అంచనాలు పక్కాగా సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 5, (ప్రజా జ్యోతి) మురసు తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి జరిగిన నష్టాలపై సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో తుఫాన్ ప్రభావం, జరిగిన నష్టాలు, చేపట్టిన పునరుద్ధరణ చర్యలపై సమీక్షించారు. పూర్తిస్థాయిలో నష్టాలను పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నమోదు చేయాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన నష్టాలకు సంబంధించిన పూర్తి వివరాలను శుక్రవారం లోగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖల నుంచి అందిన నివేదికలను క్రోడీకరించి, సమగ్ర నివేదికను శనివారం ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారి ప్రాథమిక నివేదిక ప్రకారం సుజాతనగర్ మండలంలో కూరగాయల పంటలు, దమ్మపేట మండలంలో ఆయిల్‌పామ్ పంటలకు నష్టం జరిగినట్లు వివరించారు. పంట నష్టాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పూర్తి వివరాలను సేకరించాలని కలెక్టర్ సూచించారు.విద్యుత్ శాఖ పరిధిలో సుమారు 100 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా, వాటిలో 35 స్తంభాలను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో పనులకు ఆటంకం కలుగుతున్నట్లు వివరించారు. ప్రత్యామ్నాయ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల వివరాలు, జీపీఎస్ కోఆర్డినేట్లతో కూడిన నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.నీటి పారుదల శాఖ పరిధిలో ఏడు చెరువులు దెబ్బతిన్నట్లు అధికారులు వివరించగా,వాటికి సంబంధించిన నష్టం అంచనాలను శుక్రవారం మధ్యాహ్నంలోగా సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో రహదారులు, డ్రైనేజీలకు స్వల్ప నష్టం వాటిల్లగా, ఆరు ఇళ్లు తీవ్రంగా, మరో 15 నుంచి 20 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. నష్టాల అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాలిటీలో రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో వెంటనే ప్రత్యామ్నాయంగా ఏఈని నియమించాలని పంచాయతీరాజ్ ఈఈని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లకు జరిగిన నష్టాల వివరాలను సేకరించి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. గ్రామీణ నీటి సరఫరా పరిధిలో జూలూరుపాడు, అశ్వారావుపేట ప్రాంతాల్లో స్వల్ప నష్టం జరిగినట్లు అధికారులు వివరించారు. గండుగులపల్లి ఐపీఎస్ వద్ద విద్యుత్ సరఫరా అంతరాయం కారణంగా అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ గోడకు స్వల్ప నష్టం వాటిల్లగా, మరమ్మతు పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు.జాతీయ రహదారులపై పెద్దగా నష్టం జరగలేదని, ఏర్పడిన చిన్న పాటి గుంతలను వెంటనే పూడ్చాలని కలెక్టర్ సూచించారు.ఇంట్రా పరిధిలో ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ తుఫాన్ వల్ల జరిగిన నష్టాలపై సమగ్ర వివరాలను నిర్దేశిత గడువులో గా సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి.. మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజల ఆకాంక్ష
- బీఆర్ఎస్ శ్రేణులకు రేగ కాంతారావు పిలుపు



పినపాక,నవంబర్ 5(ప్రజాజ్యోతి): రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షుడు రేగ కాంతారావు పిలుపునిచ్చారు.పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం అడ్డరోడ్డులోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

›› కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని రేగ కాంతారావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, నిరుద్యోగులు, విద్యార్థులు, పట్టభద్రులు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు.

›› పట్టభద్రుల ఓటరు నమోదు 70 శాతం లక్ష్యం సాధించడం అభినందనీయం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పినపాక మండలంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో 70 శాతం లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమని తెలిపారు. ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు.

›› ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, నాయకులు వాసు బాబు, కొండేరు రాము, సత్తిబాబు, వెంకటేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ, సత్యం, బుల్లిబాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల్లో ఎంపీఓ షేక్ శబ్నా తనిఖీలు

- రికార్డులు, నర్సరీలు, డంపింగ్ యార్డుల పరిశీలన



పాల్వంచ, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి: పాల్వంచ మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో మండల పంచాయతీ అధికారి షేక్ శబ్నా గురువారం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఉల్వనూరు, లక్ష్మీదేవిపల్లి–యూ, మల్లారం, బంజర గ్రామపంచాయతీల్లో పర్యటించి పలు అంశాలను పరిశీలించారు. గ్రామపంచాయతీలకు సంబంధించిన రికార్డులు,నర్సరీలు,డంపింగ్ యార్డులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించి, పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లక్ష్మీదేవిపల్లి–యూ గ్రామంలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో బాత్రూమ్ నిర్మాణానికి సంబంధించి ముగ్గు వేసి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.ఈ తనిఖీల్లో సంబంధిత గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



విజయ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

- 72 మందికి టీబీ ఎక్స్‌రే పరీక్షలు



చర్ల, నవంబర్ 05 (ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని విజయ కాలనీలో గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, టీబీ ఎక్స్‌రే క్యాంపు విజయవంతంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 72 మంది టీబీ ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోగా, పలువురు బీపీ, షుగర్ తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, క్షయవ్యాధి (టీబీ) లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. టీబీ సోకిన వారు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు మందులను క్రమం తప్పకుండా వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని అన్నారు.30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ టీ–హబ్ ద్వారా నిర్వహించే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బీపీ, షుగర్ బాధితులు వైద్యుల సలహా మేరకు మందులు క్రమం తప్పకుండా వాడాలని, అవసరమైన మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా లభిస్తాయని వివరించారు. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని 14 సంవత్సరాలు నిండిన ప్రతి అమ్మాయి 15 సంవత్సరాల లోపు ఈ టీకా తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక మాట్లాడుతూ టీబీ రోగులకు ప్రభుత్వం ఉచిత వైద్య చికిత్సతో పాటు ప్రతి నెలా రూ.1,000 ఆర్థిక సహాయం అందిస్తోం దని తెలిపారు. రోగులకు అవసరమైన పోషకాహార కిట్లు కూడా అందజేస్తున్న ట్లు వివరించారు.ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారులు సూచించారు.ఈ కార్యక్రమం లో రైస్ పేట స్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీనివాసరావు,టీబీ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, ఎక్స్‌రే టెక్నీషియన్ శ్రీనివాసరావు, కమ్యూనిటీ మొబిలైజర్ సీతారామ య్య, వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ కుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. రామల క్షి , హెల్త్ సూపర్వైజర్ రామ్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, హెల్త్ అసిస్టెం ట్లు ధర్మారావు,నేరసింహారావు,పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వార్డు సభ్యులు సమ్మక్క, వరలక్షి , పుష్పవతి, స్పందన తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతమైన రక్తదాన శిబిరం

చర్ల, నవంబర్ 05(ప్రజా జ్యోతి): చర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయడం పట్ల గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. రక్తదానం చేసిన యువకులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పాయం సత్యనారాయణ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రమాదాలకు గురైన బాధితులకు సకాలంలో రక్తం అందకపోవడంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి రక్తదాన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను రక్షించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో పాటు గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు భీరబోయిన శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీరబోయిన అరుణ, సోయం తులసి, మండల అధ్యక్షుడు ఇర్ప అంజిబాబు, మండల ప్రధాన కార్యదర్శి కాయం శ్రీనివాసరావు, నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పున్నం రామకృష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తడికల శివకుమార్, ఈసంపల్లి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచలో బెల్లం వాహనం తనిఖీ

► జీఎస్‌టీ పరంగా పన్ను ఎగవేత లేదని స్పష్టం చేసిన సెంట్రల్ ట్యాక్స్ సూపరింటెండెంట్

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 05: (ప్రజాజ్యోతి) పాల్వంచ పట్టణంలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన బెల్లం రవాణా వాహనానికి సంబంధించి సెంట్రల్ ట్యాక్స్ అధికారులు స్పష్టతనిచ్చారు. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఎలాంటి పన్ను ఎగవేత జరగలేదని తేల్చారు. ఇందుకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాల్వంచ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అశోక్ లీలండ్ ట్రాన్సిట్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ తనికీలో రవాణా పత్రాలు, ట్యాక్స్ ఇన్‌వాయిస్‌ను పరిశీలించగా పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి, బెల్లం సరఫరాదారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ డివిజన్, సామర్లకోట రేంజ్ పరిధిలోని కీర్తం పూడికి చెందిన 'ఎం/ఎస్ శ్రీ లక్ష్మీ గణపతి బెల్లం & జనరల్ మర్చంట్'. కొనుగోలుదారుడు పాల్వంచకు చెందిన 'ఎం/ఎస్ బాలాజీ జాగర్ & జనరల్ మర్చంట్' గా ఉంది, వస్తువుల వివరాల కు వస్తే ఎలాంటి బ్రాండ్ లేని విడి బెల్లం తరలిస్తున్నట్లు గుర్తించారు. జీఎస్‌టీ, ఈ-వే బిల్లు నిబంధనలు, ప్రస్తుత జీఎస్‌టీ రేట్ల వర్గీకరణ ప్రకారం బ్రాండ్ లేని విడి బెల్లానికి 0% జీఎస్‌టీ వర్తిస్తుంది. పన్ను మినహాయింపు/సున్నా రేటు ఉన్న ఈ వస్తువులకు పోర్టల్‌లో తప్పనిసరిగా ఈ-వే బిల్లు జనరేట్ చేయాల్సిన అవసరం ఉండదని అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల సీజీఎస్‌టీ లేదా టీజీఎస్‌టీ చట్టాల ప్రకారం ఎలాంటి రెవెన్యూ నష్టం లేదా పన్ను ఎగవేత జరగలేదని స్పష్టం చేశారు, అబ్కారీ శాఖ అధికారులు పన్ను పరంగా ఎలాంటి ఉల్లంఘన జరగనప్పటికీ, పట్టుబడిన సరుకులో నల్ల బెల్లం లేదా మొలాసిస్ ఆధారిత పదార్థాలు ఉంటే వాటిని సారా తయారీకి మళ్లించే అవకాశం ఉందా అనే కోణం లో విచారించాలని సూచించారు. ఒకవేళ స్థానిక సమాచారం లేదా భౌతిక తనిఖీల్లో నాటుసారా తయారీకి సంబంధించి ఏదైనా దుర్వినియోగం లేదా ఉల్లంఘన గుర్తిస్తే, తెలంగాణ ఎక్సైజ్ చట్టం, ఇతర చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవచ్చని కొత్తగూడెం రేంజ్ సెంట్రల్ ట్యాక్స్ సూపరింటెండెంట్ జి.ఎస్. దినేష్ నాయక్ పాల్వంచ టౌన్ పోలీసులకు లేఖ ద్వారా తెలిపినట్లు తెలిసింది.

తుఫాన్ బాధిత రైతులకు తక్షణ పరిహారం ఇవ్వాలి

► తెలంగాణ రైతు సంఘం డిమాండ్

దమ్మపేట,నవంబర్. 05 (ప్రజాజ్యోతి): మురసు తుఫాన్‌తో దమ్మపేట మండలంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) మండల కమిటీ డిమాండ్ చేసింది. వరదలకు కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొంది. వరికి ఎకరానికి రూ.30 వేలు, పత్తి, మొక్కజొన్న, అరటి, వేరుశెనగ పంటలకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని కోరింది. దెబ్బతిన్న ఇళ్లకు ఇందిరమ్మ పక్కా గృహాలు నిర్మించాలని, తెగిపోయిన చెరువులు, రహదారులకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. అధికారులు క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేసి పరిహారం అందించాలని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యండ్రాతి అప్పారావు, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, కేశవ రావు, సూర్యనారాయణ, పర్వతనేని కాంతారావు, కే.కేశవరావు పాల్గొన్నారు.




రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

► బీఆర్ఎస్ నాయకురాలు సున్నం నాగమణి డిమాండ్

దమ్మపేట,నవంబర్. 05 (ప్రజాజ్యోతి): మురసు తుఫాన్‌తో భారీ వర్షాలు, వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి డిమాండ్ చేశారు. వరదలకు వాగులు, రహదారులు దెబ్బతినడంతో పాటు చెరువులకు గండ్లు పడి చేతికొచ్చిన పంటలు నీటిపాలయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే క్షేతస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి బాధిత రైతులకు పరిహారం అందించాలని కోరారు.



- డాక్టర్ స్లిప్ లేకుండానే టాబ్లెట్ల దందా...
- అర్హత లేని వారి చేతిలో ప్రజల ప్రాణాలు
- ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు..!
- ప్రిస్క్రిప్షన్ లేకపోయినా పర్లేదు... డబ్బుంటే చాలు... మందుల షాపుల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- వైద్యాధికారుల నిద్ర రోగుల పాలిట శాపంగా మారిన నకిలీ మందుల దందా..!
- ఏ కంపెనీ మందో తెలియదు, ఏ డోసో తెలియదు అయినా అంటగడుతున్న మెడికల్ షాపులు...
- మందుల వ్యాపారం ప్రజల ప్రాణాలను తీస్తోందా...?



మణుగూరులో... మెడికల్ కార్టెల్..!

డాక్టర్ రాసిన చీటీ లేకుండానే మందులు అమ్మే దందా మణుగూరు మండలంలో రెచ్చిపోతోంది. అర్హత లేని కొందరు వ్యక్తులు సైతం మెడికల్ షాపులు తెరిచి డాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. లైసెన్స్ ఒకరిదైతే షాపు నడిపేది మరొకరు కావడం ఇక్కడ సర్వసాధారణమైపోయింది. రకరకాల కంపెనీల మందులు తెప్పించి రోగం ఏమిటో తెలియకుండానే రోగులకు అంటగడుతున్నారు. కొందరు వ్యాపారులు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి ప్రమాదకర మందులను సైతం ఇష్టానుసారం అమ్మేస్తున్నారు. దీంతో చిన్న జ్వరానికి వెళ్లిన రోగి పెద్ద జబ్బుతో తిరిగి వస్తున్న దుస్థితి నెలకొంది. నిబంధనలు కాగితాలకే పరిమితం కాగా, జిల్లా వైద్యాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

● మణుగూరు, ప్రజాజ్యోతి

మణుగూరు, నవంబర్ 05 (ప్రజాజ్యోతి): ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన మందుల షాపులే ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లోనూ పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు వెలిశాయి. ఫార్మసిస్ట్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే షాపు నిర్వహించాలన్న నిబంధనను తుంగలో తొక్కారు.

లైసెన్స్ పేరు ఒకరిదైతే, కౌంటర్ లో కూర్చుని మందులు ఇచ్చేది మరొకరుగా ఉన్నారు. కొన్ని చోట్ల అసలు అర్హతే లేని వ్యక్తులు సైతం రోగులను పరీక్షించి మందులు రాసి ఇవ్వడం గమనార్హం.

మెడికల్ షాపుల మాఫియాకు కౌంట్ డౌన్... ఇక దాడులే...

లైసెన్స్ లు రద్దే..!

డాక్టర్ చీటీ లేకుండా మందులు అమ్ముతున్నారా..? ఇక మీ ఆట కట్టినట్టే. అర్హత లేకుండా షాపు ఏర్పాటు చేసి రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్నారా..? ఇక మీ లైసెన్స్ లు రద్దయినట్టే. మణుగూరు మండలంలో రెచ్చిపోతున్న మెడికల్ దందాపై ఇక ఉపేక్షించేది లేదని తెలుస్తోంది. లైసెన్స్ ఒకరిది, నడిపేది మరొకరు కావడం ఇక్కడ ఫ్యాషన్ అయిపోయింది. రకరకాల కంపెనీల మందులను తెప్పించి రోగులకు అంటగడుతున్న తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఇకపై ప్రతి అక్రమ షాపుపై దాడులు, సీజ్, కేసులు తప్పవని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందు అమ్మితే జైలే... డ్రగ్ అధికారుల ఉదాసీనతపై హైకోర్టుకు వెళ్తాం..!

ప్రిస్క్రిప్షన్ అడగకుండా మందులు అమ్మడం మణుగూరులో మామూలై పోయింది. నొప్పికి, నిద్రకు, దగ్గుకు అంటూ షెడ్యూల్ మందులను సైతం ఇష్టానుసారంగా అమ్మేస్తున్నారు. యాంటీబయాటిక్స్ విచ్చలవిడిగా వాడటం వల్ల రోగ నిరోధక శక్తి దెబ్బతింటోంది.

చిన్న జ్వరానికి వెళ్లిన రోగి పెద్ద జబ్బుతో తిరిగి వస్తున్నాడు. ఇంత జరుగుతున్నా డ్రగ్ ఇన్ స్పెక్టర్లు ఒక్కసారి కూడా తనిఖీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులు కదలకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

అర్హత లేని నకిలీ డాక్టర్ల ఆట కట్టు... లేకపోతే కదిలేది ప్రజా ఉద్యమమే..!

కౌంటర్ లో కూర్చున్న వ్యక్తే డాక్టర్ అవతారం ఎత్తుతున్నాడు. రోగం ఏమిటో తెలియకుండానే మందులు రాసి ఇచ్చేస్తున్నాడు. మందుల మోతాదు తప్పితే కిడ్నీలు, లివర్ దెబ్బ తింటాయని వైద్యులు చెబుతున్నా వినేవారు లేరు.

డబ్బు కోసం ఏ కంపెనీ మందైనా సరే రోగికి అంటగడుతున్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ నకిలీ షాపులపై వెంటనే కొరడా ఝుళిపించాలని ప్రజలు ముక్త కంఠంతో ఆరోపిస్తున్నారు. లేకపోతే ప్రజా ఉద్యమం తప్పదని తెగేసి చెబుతున్నారు.

వరద బీభత్సంతో దెబ్బతిన్న రహదారులు

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన సర్పంచ్ మడకం విజయ
- తక్షణ మరమ్మతులకు అధికారులకు విజ్ఞప్తి...

ములకలపల్లి, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రాచన్నగూడెం పంచాయతీ పరిధిలో రహదారులు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ మడకం విజయ రెవెన్యూ అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని మోటుగూడెం గ్రామంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గం వర్షాల ధాటికి కోతకు గురికావడాన్ని పరిశీలించారు. రాచన్నగూడెం గ్రామంలో మోరీ కుంగిపోవడంతో ఏర్పడిన భారీ గుంతను సైతం పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులు, గ్రామస్తులకు రాకపోకల ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సోయం రాంబాబు, గ్రామ పరిపాలన అధికారి నవీన్, పంచాయతీ కార్యదర్శి బిట్టా వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్ మాస్ లైన్) జిల్లా నాయకులు పోతుగంటి లక్ష్మణ్ పాల్గొన్నారు.





ఆపదలో నేనున్నానంటూ...





- గర్భిణిని వాగు దాటించి.....
- నష్టపోయిన పంటలను పరిశీలించిన సర్పంచ్
- మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి సేవలకు గ్రామస్తుల ప్రశంసలు



ములకలపల్లి, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మానవత్వాన్ని చాటుకున్నారు. మురసు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మూకమామిడి – మొగరల గుప్ప గ్రామాల మధ్య ఉన్న వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో మొగరలగుప్ప గ్రామానికి చెందిన నిండు గర్భిణికి గురువారం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆస్పత్రికి వెళ్లేందుకు మార్గం లేక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆదిలక్ష్మి వెంటనే అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులు, యువకుల సహకారంతో వరద నీటిలోకి దిగి గర్భిణిని సురక్షితంగా వాగు దాటించి ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ ఆమె చూపిన చొరవ, తెగువపై గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు.

పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలన

మరోవైపు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు మూకమామిడి గ్రామపంచాయతీ పరిధిలో వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట నేలమట్టం కావడంతో ఆందోళనలో ఉన్న రైతులకు భరోసా కల్పించేందుకు సర్పంచ్ ఆదిలక్ష్మి నేరుగా పొలాలను సందర్శించి పంట నష్టాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి దెబ్బతిన్న పంటల విస్తీర్ణం, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలల తరబడి కష్టపడి పండించిన పంటలు దెబ్బతినడం బాధాకరమన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పంట నష్టం విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే పరిహారం అందించాలని, బీమా తదితర సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. నష్టపోయిన ప్రతి ఎకరాను లెక్కలోకి తీసుకోవాలని, ఏ ఒక్క రైతు పరిహారానికి దూరం కాకూడదని స్పష్టం చేశారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో....

గత రెండు రోజులుగా రాత్రింబవళ్లు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యల్లో సర్పంచ్ పాల్గొంటున్నారు. వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడటం, గర్భిణిని సురక్షితంగా వాగు దాటించడం, తెగిపోయిన వంతెన వద్ద ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు రైతుల పంట నష్టాలను పరిశీలించడం ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఆమె సేవలను గ్రామస్తులు, మహిళలు, యువకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కీసరి రాజ్‌కుమార్, రైతులు గడ్డం వినోద్‌కుమార్, కుంజ వెంకటేష్, గుండి శ్రీను, గ్రామస్తులు తానం సాయిబాబు, పోడియం ధర్మరాజు, కురుసం నరసింహారావు, కుంజ చందు, సంతోష్, కీసరి శివ, గడ్డం గణేష్ పాల్గొన్నారు.

మురసు తుపాను దెబ్బకు విలవిలలాడిన అన్నదాత





- వేలాది ఎకరాల్లో పంట నష్టం....!
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు

ములకలపల్లి నవంబర్ 5, (ప్రజాజ్యోతి) : మురసు తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు ములకలపల్లి మండలంలోని రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. భారీ వర్షాల ధాటికి పలు రకాల పంటలు దెబ్బతినడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు స్థానిక సర్పంచుల సహకారంతో క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను పరిశీలించారు. మండలంలోని ములకలపల్లి, పొగళ్లపల్లి, పుసుగూడెం, జగన్నాధపురం క్లస్టర్ పరిధిలోని 12 రెవెన్యూ గ్రామాల్లో అధికారులు పంట పొలాలను పరిశీలించారు. ములకలపల్లి క్లస్టర్ పరిధిలో ములకలపల్లి, మాదారం, కమలాపురం గ్రామాలు, పుసుగూడెం క్లస్టర్ పరిధిలో పుసుగూడెం, అన్నారం, చాపరాలపల్లి గ్రామాలు, పొగళ్లపల్లి క్లస్టర్ పరిధిలో పొగళ్లపల్లి, తిమ్మంపేట, మూకమామిడిగ్రామాలు, జగన్నాధపురం క్లస్టర్ పరిధిలో జగన్నాధపురం, కాపుగంగారం, రాచన్నగూడెం గ్రామాల్లో పర్యటించి పంటల పరిస్థితిని అంచనా వేశారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశెనగ, మినుము తదితర పంటలకు జరిగిన నష్టాన్ని రైతులతో కలిసి పరిశీలించి వివరాలను సేకరించారు. దెబ్బతిన్న పంటల విస్తీర్ణాన్ని నమోదు చేసుకున్నారు. మండలవ్యాప్తంగా మొత్తం 1,205 మంది రైతులకు చెందిన 2,438 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు అశ్వరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్ తెలిపారు. తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు వ్యవసాయ విస్తరణ అధికారులు రాహుల్ గాంధి, రమేష్, సుజాత, సూరిబాబు, పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులను వెంటనే ఆదుకోవాలి


- బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ డిమాండ్



దమ్మపేట, నవంబర్ 05 (ప్రజాజ్యోతి): మురసు తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దమ్మపేట మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని ప్రకటించి పరిహారం అందించాలని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ డిమాండ్ చేశారు. వరి, మొక్కజొన్న, అరటి, శెనగ తదితర పంటలు దెబ్బతిన్నాయని, అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వే చేపట్టాలని కోరారు. వర్షాలకు దెబ్బతిన్న పూరిళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని, నీట మునిగిన కాలనీల్లో సహాయక చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తెగిపోయిన చెరువులు, కుంటలు, దెబ్బతిన్న రహదారులకు వరద తగ్గిన వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎర్రజెండా పోరాట యోధుడు గుగులోతు ధర్మాకు ఘన నివాళి

- ఘనంగా మూడో వర్ధంతి.. ఆశయాలను కొనసాగించాలని సీపీఎం నేతల పిలుపు



దమ్మపేట, నవంబర్ 05 (ప్రజాజ్యోతి): పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్ గుగులోతు ధర్మా ఆశయాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. గురువారం దమ్మపేటలో సీపీఎం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన ధర్మా మూడో వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మీనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పిట్టల అర్జున్ మాట్లాడుతూ ధర్మా జీవితాంతం ఎర్రజెండా సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లారని, పేదలు, కార్మికులు, రైతుల సమస్యలపై నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొలికిపోగు శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మురుసు తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి: మేడ మోహన్ రావు



చంద్రుగొండ నవంబర్ 05 (ప్రజాజ్యోతి): మురుసుతుఫాన్ ప్రభావంతో రైతుల వేలాది ఎకరాల్లో వరి, పత్తి, ఇతర సాగు పంటలు తీవ్రంగా దెబ్బతినడం పట్ల బీఆర్ఎస్, జిల్లా నాయకులు మాజీ సొసైటీ వైస్ చైర్మన్ మేడ మోహన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు వర్షాల కారణంగా నీటమునిగి, నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టాన్ని అంచనా వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చంద్రుగొండ మండలం లో పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును గుర్తించి, నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్టుబడుల భారం, రైతు ఇబ్బందులు పడుతున్న వేళ ప్రకృతి వైపరీత్యం మరింత నష్టాన్ని మిగిల్చిందని అని అన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టి, వారికి అండగా నిలవాలని కోరారు.

వరదలకు కొట్టుకుపోయిన వంతెనల నిర్మాణం చేపట్టాలి

- రాజుపేట డైవర్షన్ నిర్మాణంపై విచారణ జరపాలి
- పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి:
- సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు.





ములకలపల్లి, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): మురాసు తుపాను వరదలకు కొట్టుకుపోయిన మొగరాలగుప్ప, రాజుపేట వాగులపై తక్షణమే తాత్కాలిక డైవర్షన్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం జిల్లా బృందంతో కలిసి దెబ్బతిన్న వంతెనలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొగరాలగుప్ప వంతెన కొట్టుకుపోవడంతో గ్రామస్తులకు రాకపోకలు నిలిచిపోయాయని, అత్యవసర వైద్య సేవలకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రాజుపేట వద్ద రూ.60 లక్షలతో నిర్మించిన డైవర్షన్ నాసిరకం పనుల కారణంగా వరదలకు కొట్టుకుపోయిందని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ములకలపల్లి–దమ్మపేట రహదారిపై రాకపోకలు పునరుద్ధరించేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన పంటలను గుర్తించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నిమ్మల మధు, గోపగాని లక్ష్మీనరసయ్య, కీసరి రాజ్‌కుమార్, ఓరుగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన డీఈఓ శింబు ప్రసాద్



ములకలపల్లి, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముంపునకు గురైన తాళ్లపాయ, కంపగూడెం పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి శింబు ప్రసాద్ గురువారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో వరదల కారణంగా ఏర్పడిన పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీఎస్ తాళ్లపాయ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారితో కలిసి సందర్శించారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన బురద, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేసేందుకు గ్రామ సర్పంచ్ గడ్డం సుజాత ప్రత్యేక చొరవ తీసుకొని శుభ్రత పనులు చేపట్టడంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కంపగూడెం పాఠశాలను సందర్శించి వరద ప్రభావాన్ని పరిశీలించారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస వేలంపాటలో దేవస్థానానికి పెరిగిన ఆదాయం

- గతేడాది రూ.43 వేల నుంచి ఈ ఏడాది రూ.67 వేలకు చేరిన వేలం పాట



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 5, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నెలరోజుల పాటు ఆలయంలో నిర్వహించే సేవలకు సంబంధించి బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. ఇందులో కొబ్బరికాయలు, పూజా సామగ్రి పోగు చేసుకునే హక్కు, భక్తులు సమర్పించే కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయించుకునే హక్కులకు వేలంపాటలు నిర్వహించారు. గత ఏడాది ఈ వేలంపాటల ద్వారా రూ.43 వేల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.67 వేల ఆదాయం లభించింది. గత ఏడాదితో పోలిస్తే రూ.24 వేల అదనపు ఆదాయం సమకూరింది. ఈ వేలంపాటల కార్యక్రమంలో ఆలయ మేనేజర్ పి.వి. రమణ, గ్రామ సర్పంచ్ లక్ష్మి , ఉప సర్పంచ్ మారగాని అశోక్, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, పానుగంటి రాఘవులు, సత్యనారాయణ, రాంబాబు, కార్యనిర్వహణాధికారి పి. మధుబాయి చౌదరి, వేలంపాటదారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- విశ్రాంతి ఉద్యోగి చింతా రామ్మోహనరావు



భద్రాచలం, నవంబర్ 5, (ప్రజాజ్యోతి): చర్ల సమీపంలోని రాళ్లగూడెం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన చింతా రామ్మోహనరావు భద్రాచలంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ లో సభ్యత్వం పొందారు. అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు సభ్యత్వం అందించి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం భద్రాచలంలో ఉంటూ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం ద్వారా కృషి చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. సంఘ సభ్యులతో కలిసి పనిచేస్తానని తెలిపారు. అనంతరం తన గురువు, అసోసియేషన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావును చింతా రామ్మోహనరావు శాలువాతో సత్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి. ప్రసాద్, గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య చౌదరి, డి. కృష్ణమూర్తి, ముగడ హరినాథ్, మురళీకృష్ణ, టి.జి. విజయ భాస్కర్, శివప్రసాద్, శ్యామ్ సుందర్ రావు, జగ్గా పుల్లయ్య, చుక్క రాంబాబు, విష్ణు, మొలకల సుబ్రహ్మణ్యం, సాధం కాశయ్య, సుందరబాబు, బూదాటి కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

103 రాగాల్లో దాశరథీ శతకం...

- ‘శతరాగ దాశరథి’ గ్రంథం ఆవిష్కరణ



భద్రాచలం, నవంబర్ 5, (ప్రజా జ్యోతి): భక్త రామదాసు రచించిన దాశరథీ శతకంలోని 103 పద్యాలకు 103 విభిన్న రాగాల్లో స్వరాలు సమకూర్చి, వాటి స్వర, పద్య తాత్పర్యాలతో ప్రముఖ గాయని జి.శ్రీరామ రత్న రూపొందించిన ‘శతరాగ దాశరథి’ గ్రంథాన్ని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆవిష్కరించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. దామోదర్ రావు ఆలయంలో ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. భక్త రామదాసు సాహిత్య వైభవాన్ని సంగీత రూపంలో పరిచయం చేసే ఈ గ్రంథం భక్తి, సాహిత్య, సంగీత ప్రియులకు విశేషంగా ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, దేవస్థానం రామాయణ పారాయణదారు ఎస్.టి.జి. అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ప్రతి వీధిలో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలి
- మల్టీపర్పస్ వర్కర్లకు ఎంపీడీవో రాజేశ్వరి సూచనలు



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 5, (ప్రజాజ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో డి. రాజేశ్వరి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని నర్సాపురం గ్రామ పంచాయతీలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి గ్రామంలో మల్టీపర్పస్ వర్కర్లు ప్రతిరోజూ ఉదయం నుంచే విధుల్లో పాల్గొని అన్ని వీధుల్లో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్ ద్వారా ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. గ్రామాల పరిశుభ్రతలో మల్టీపర్పస్ వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీవో సూచించారు. పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని, సిబ్బందితో కలిసి అన్ని వీధులు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా జరిగేలా చూసి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొని పారిశుధ్య పనులను చేపట్టారు.

మాదారంలో నూతన భవనం నిర్మించాలి: రైతు సంఘం నేత రవికుమార్



ములకలపల్లి, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): మురసు తుఫాన్ ప్రభావంతో మాదారం అంగన్వాడీ అద్దె భవనం పరిసరాలు బురదమయంగా మారి చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ అన్నారు. గురువారం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గ్రామస్తులు, ఉపాధ్యాయులు, చిన్నారులతో కలిసి నిరసన తెలిపారు. అంగన్వాడీకి వెళ్లలేక కొందరు చిన్నారులు వెనుదిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె భవనంలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, రెండు కేంద్రాలు ఒకే చోట నిర్వహించడం సమస్యగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి మాదారంలో రెండు అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు చనగాని వినోద్, పసుల సూర్య, ముదిగొండ రవి, అంగన్వాడీ టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

ఐఎఫ్ఎంఐ ఎస్ జిల్లా స్థాయి కాస్కేడింగ్ శిక్షణ కార్యక్రమం విజయవంతం

కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 5, (ప్రజా జ్యోతి)





కొత్తగూడెం జిల్లా ఖజానా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రప్రభుత్వ ఆర్థిక శాఖ జారీ చేసిన సర్క్యులర్ మెమో నెం. 4338976-C/394/A1/BG/2026, 02.11.2026 ప్రకారం, ఐఎఫ్ఎమ్ఐఎస్ పై జిల్లా స్థాయి కాస్కేడింగ్ శిక్షణ కార్యక్రమం గురువారం విజయవంతమైంది. ఐడిఓసి కార్యాలయంలో జరిగిన ఈ ప్రత్యేక సమావేశం జిల్లా ఖజానా అధికారి జుక్క మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి కొత్తగూడెం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 450 మంది కి పైగా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఇందులో భాగం గా ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ ఆర్థిక పరిపాలన వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడంలో ఐఎఫ్ఎమ్ఐఎస్ పరిధిలోని మాడ్యూల్స్‌పై శిక్షణ,అవగాహన కల్పించారు, ఆయా మాడ్యూల్స్ వినియోగ విధానాలు, కార్యాచరణ పద్ధతులు, ఆర్థిక నిర్వహణలో వాటి ప్రాముఖ్యత,సంబంధిత ఆన్‌లైన్ ప్రక్రియలను ప్రాక్టికల్ డెమాన్‌స్ట్రేషన్ ఖజానా జిల్లా అధికారి వివరించారు, ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు,సిబ్బందికి ఐఎఫ్ఎమ్ఐఎస్ మాడ్యూల్స్‌పై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, డిజిటల్ ఆర్థిక నిర్వహణ విధానాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన సూచనలు అందజేశారు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, విధివిధానాల్లో పారదర్శకమైన డిజిటల్ పరిపాలనను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిలిచింది, జిల్లా ఖజానా అధికారి మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ అధికారులు సైదులు, శ్రీ పి. శ్రీనివాస్, బి. శారద, అక్బర్ పాషా, జి. హరీష్, కె. రష్మితేజస్వి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు

వంద శాతం హాజరే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు
- ప్రధానోపాధ్యాయులు జి. హరి ప్రసాద్



చర్ల, నవంబర్ 05:(ప్రజా జ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ, విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు విద్యాశాఖ నవంబర్ నెలలో చేపట్టిన 100 శాతం విద్యార్థుల హాజరు లక్ష్యాన్ని విజయవంతం చేయడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో కీలకమని పాఠశాల కమిటీ చైర్మన్ ఎం. అనూరాధ, ప్రధానోపాధ్యాయులు జి. హరి ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. 2027 మార్చిలో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నవంబర్ నెల నుంచి పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.15 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఇంటి వద్ద చదువుకునేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరారు. పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా తల్లిదండ్రులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనవాసీ హాస్టల్ నిర్వాహకులు, సంరక్షకులు జవ్వాది మురళి, చర్ల ఎస్సీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పి. శ్రీనివాస్ (పీడీ), పి. వెంకటేశ్వర్లు, డి. శివ రామకృష్ణ, ఎం. గునిరామ్, పి. వెంకటేష్, ఎస్. జాన్ మణి, పి. సరిత, ఎస్. వర లక్షి , కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- దంతలబోరు ఉమ్మడి పంచాయతీలో పంట నష్టాన్ని అంచనా వేసిన సీపీఐ రైతు సంఘం బృందం.
- ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే తగ్గిన దిగుబడులు.. తుఫాన్‌తో రైతులకు మరింత నష్టం





పాల్వంచ, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి: మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పాల్వంచ మండలం దంతలబోరు ఉమ్మడి పంచాయతీ పరిధిలోని రైతులను గురువారం సీపీఐ రైతు సంఘం ప్రతినిధి బృందం పరామర్శించి పంట నష్టాన్ని అంచనా వేసింది.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా వర్గ సభ్యుడు వీసంశెట్టి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. బుధవారం కురిసిన మురసు తుఫాన్ వర్షాలతో పాల్వంచ మండలంలో ప్రకృతి బీభత్సం సృష్టించిందన్నారు. రెండు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైందని, పంట చేతికొచ్చే సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.దంతలబోరు ఎస్సీ కాలనీ పంచాయతీ పరిధిలోని ఎర్రచెరువు, నీళ్లకుంట అలుగు పారడంతో వరి పంటలు నీట మునిగి అపార నష్టం వాటిల్లిందన్నారు.ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో అంతంతమాత్రంగా ఉన్న పంట దిగుబడులు, తుఫాన్ వర్షాలతో మరింత తగ్గిపోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.వ్యవసాయ శాఖ జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, సమగ్ర నివేదికను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున వరి పంటకు, రూ.50 వేల చొప్పున పత్తి, మిర్చి పంటలకు నష్టపరిహారం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ పర్యటనలో రైతు సంఘం జిల్లా నాయకులు ఇట్టి వెంకట్రావు, తమ్మళ్ల వెంకటేశ్వర్లు, తాళ్ల వెంకటేశ్వర్లు, రాంబాబు, పండగ నారాయణ, బర్ల నాగయ్య, పొందురోశయ్య, కంటే నరసయ్య, కృష్ణ, అర్జునరావు, నిమ్మల నరి, సండూరి చిన్న తిరుపతి, బర్ల బాబు, రోశయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

తాండ్ర కుటుంబ వివాహ వేడుకకు డిప్యూటీ సీఎం, ఎంపీకి ఆహ్వానం



భద్రాచలం, నవంబర్ 5, (ప్రజా జ్యోతి) : భద్రాచలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తాండ్ర నరసింహారావు కుటుంబ సభ్యులు తమ ఇంట జరగనున్న వివాహ వేడుకకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆహ్వానించారు. ఈ నెల 25న జరగనున్న తాండ్ర నరసింహారావు కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ కుటుంబ సభ్యులు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ భద్రాచల ప్రాంతంతో తమ కుటుంబానికి ఎంతో విడదీయరాని అనుబంధం ఉందని, ఈ ప్రాంతంతో ప్రత్యేకమైన సంబంధాలు ఉన్నాయని తెలిపారు. వివాహ వేడుకకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.అనంతరం మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌ను ఆయన స్వగృహంలో కలిసి తాండ్ర కుటుంబ సభ్యులు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకుడి కుటుంబ వివాహ వేడుకకు తన బిజీ కార్యక్రమాల మధ్య కూడా తప్పకుండా హాజరవుతానని ఎంపీ తెలిపారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎంపీ ఇద్దరూ వివాహానికి హాజరవుతామని హామీ ఇవ్వడంతో తాండ్ర కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

భారీ వర్షాలకు నేలకొరిగిన వరి పంటలు.. రైతులకు భారీ నష్టం

- మండలవ్యాప్తంగా 787 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు.. రైతులకు పలు సూచనలు



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 5, (ప్రజాజ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో వరి పంటలు నేలకొరిగాయి.దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు మండల వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 787 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. రైతులు పొలాల్లో వర్షపు నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. కొంతమేర మాత్రమే నేలకొరిగిన పంటలు సహజంగా కోలుకునే అవకాశం కల్పించాలని, మొక్కలు కుళ్లిపోకుండా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు అన్నభేది పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పంటలో అగ్గి తెగులు, పొట్టకుళ్లు తెగులు లక్షణాల ను ఎప్పటికప్పుడు గమనించాలని, తెగుళ్ల లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో వ్యవసాయ అధికారి అనూష, వ్యవసాయ విస్తరణ అధికారులు సంధ్యారాణి, శాంతి, పలువురు రైతులు పాల్గొన్నారు. రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను కాపాడుకోవాలని అధికారులు కోరారు.

తుఫాన్ నష్టంపై అధికారులు నివేదిక పంపాలి

- పంటలు కోల్పోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి
- పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల
- పాత పాల్వంచలో వ్యవసాయ అధికారులతో కలిసి పంట నష్టాన్ని పరిశీలించిన కొత్వాల



పాల్వంచ, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి: మురసు తుఫాన్ ప్రభావంతో అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన అన్నదాతలను ఆదుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు.గత మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పాల్వంచ మండలంతో పాటు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. గురువారం పాత పాల్వంచలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించిన కొత్వాల.. వర్షపు నీటిలో మునిగి, గింజలు రాలిపోయిన వరి పంటను పరిశీలించారు. పంట నష్టాన్ని అధికారులకు క్షేత్రస్థాయిలో చూపించి వివరించారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలకు పొట్ట దశలో ఉన్న వరి పైరు నేలవాలి, వరద నీటిలో మునిగిపోయిందన్నారు. పత్తి పంట వర్షాలకు తడిసి నల్లగా మారి బూజు పట్టే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, పత్తి పంటలకు భారీగా నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలని కొత్వాల కోరారు.ఏఈఓ జి. నరేష్, రైతులు సయ్యద్ వజీర్, వెంగళరావు, యాదయ్య, బేకరి శ్రీనివాసరావు, గుమ్మడివెల్లి సత్యం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దశదిన కర్మలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రేగా



ఆళ్ళపల్లి,నవంబర్5(ప్రజా జ్యోతి) మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి చెందిన నమస్తే తెలంగాణ రిపోర్టర్ కోతి చంద్రశేఖర్ వారి తండ్రిగారైన గీత కార్మికుడు కోతి యాదగిరి గత నెల 27వ తేదీన తాటి చెట్టు పై నుంచి ప్రమాద వశాత్తు కిందపడి మృతి చెందిన సంగతి విధితమే... విషయం తెలుసుకున్న పినపాక మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు గురువారం దశదినకర్మలకు హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటామని మనోధైర్యం కల్పించి మృతుడి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి,జెడ్పిటిసి కొమరం హనుమంతరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు, ఉపాధ్యక్షులు కొమరం వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శి ఎస్కే బాబా, కోపరేట్ చైర్మన్ గొగ్గెల రామయ్య,డైరెక్టర్ సాంబశివరావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వేమూరి రాంబాబు, మండల నాయకులు గొగ్గెల లక్ష్మయ్య,కృష్ణ,పొదిల రాము,యాసారపు బాబు, కొంపెల్లి సాంబయ్య, జగన్,చిట్టిమల్ల బాబు, సమ్మయ్య,రవి,నరేష్, యూత్ నాయకులు అంబోజు నవీన్ పాల్గొన్నారు.

ముగ్గురు నిరుపేదలకు రూ.12 లక్షల వైద్య సాయం కోసం ఎమ్మెల్యే విజ్ఞప్తి



భద్రాచలం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖలు పంపించారు. భద్రాచలం రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బోడెపూడి రవికుమార్‌కు గుండె, ఛాతీ శస్త్రచికిత్స కోసం రూ.5 లక్షలు, భగవాన్ దాస్ కాలనీకి చెందిన నక్క రాంబాబుకు మోకాలి మార్పిడి శస్త్రచికిత్స కోసం రూ.2 లక్షలు, వెంకటేశ్వర కాలనీకి చెందిన నానవరపు శ్రీనివాసరావుకు గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యల చికిత్స కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ముగ్గురి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం పొందేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు వైద్యపరంగా అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల సంక్షేమంపై ఐటీడీఏ పీఓ ప్రత్యేక దృష్టి





- వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ.. ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్ తప్పనిసరి
- ఆధార్ అనుసంధానంతో ఫేస్ రికగ్నిషన్ నమోదు చేయాలి – ఐటీడీఏ పీఓ బి. రాహుల్

దమ్మపేట,నవంబర్. 05, (ప్రజా జ్యోతి) : గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన వసతి, భోజనం, అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అందించాలని, ఫుడ్ ప్రొవిజన్‌కు సంబంధించిన ఇండెంట్ ను సక్రమంగా పంపించాలని స్పష్టం చేశారు.గురువారం దమ్మపేట మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థుల గదులు, డైనింగ్ హాల్, డార్మెటరీ, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లు, భోజన సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వర్షపు నీటితో విద్యార్థులకు ఇబ్బందులు.. తక్షణ మరమ్మతులకు ఆదేశాలు

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వసతి గృహ ఆవరణలోకి చేరిన నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వార్డెన్ కృష్ణబాబు పీఓ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పాత భవనం కావడంతో వర్షాల సమయంలో గోడలకు తేమ చేరి విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు.దీనిపై స్పందించిన పీఓ హాస్టల్ ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఏఈలను ఆదేశించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విద్యుత్ సమస్యలు, వర్షపు నీరు లీకేజీ సమస్యలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

పాత భవనం స్థానంలో కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రస్తుతం ఉన్న పాత భవనం కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా పాత భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు సమర్పించాలని ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్.. ఆధార్‌తో ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి

ప్రభుత్వం విద్యార్థుల కోసం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను అర్హులైన ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అందించాలని పీఓ స్పష్టం చేశారు.విద్యార్థులకు కిట్లు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని వారిని నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ ప్రొవిజన్‌కు సంబంధించిన ఇండెంట్‌ను ఎప్పటికప్పుడు సక్రమంగా పంపించాలని సూచించారు.ప్రతి విద్యార్థి ఆధార్ వివరాలను అనుసంధానం చేస్తూ ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వర్షాల నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెక్‌డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నందున విద్యార్థులు వాటిని చూడటానికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో విద్యార్థులు వసతి గృహాల నుంచి బయటకు వెళ్లకుండా వార్డెన్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఐటీడీఏ ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డీఈ బాపనయ్య, ఏఈ సుబ్బరాజు, వసతి గృహ వార్డెన్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాల్లో ఉచిత శిక్షణ

- 225 మంది విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ కోర్సులు
- విద్యార్థుల కొరకు ఐటీడీఏ పీవో బి. రాహుల్ ప్రత్యేక చొరవ



భద్రాచలం, నవంబర్ 5 (ప్రజా జ్యోతి): గిరిజన విద్యార్థులను ఆధునిక సాంకేతిక నైపుణ్యాలతో తీర్చిదిద్ది, భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందేలా చేయడమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఐటీడీఏ పీవో బి. రాహుల్ తెలిపారు. ఆయన ప్రత్యేక చొరవతో ఖమ్మం, దమ్మపేట, కొత్తగూడెం, మణుగూరు గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన 225 మంది విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించారు. ఆగస్టు 28 నుంచి అక్టోబర్ 7 వరకు 40 రోజులపాటు 100 గంటల శిక్షణను డాటా ప్రో కంప్యూటర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సైబర్ నేరాల నుంచి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని రక్షించుకోవడం, డిజిటల్ వేదికల ద్వారా వ్యాపార అభివృద్ధి, మార్కెటింగ్, సొంత బ్రాండ్ రూపకల్పన వంటి అంశాల్లో విద్యార్థులకు నిపుణులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలల ప్రిన్సిపాళ్లు, గురుకులం ఆర్‌సీవో అరుణకుమారి పీవో రాహుల్ చొరవను అభినందించారు. ఖరీదైన ఆధునిక సాంకేతిక కోర్సులను ఉచితంగా అందించడం గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఐటీడీఏ చేస్తున్న కృషిపై విద్యార్థులు సైతం హర్షం వ్యక్తం చేశారు.

నాయకులను హత్య చేసినంత మాత్రాన ప్రజా ఉద్యమాలు ఆగవు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బి. నర్సారెడ్డి
- ఘనంగా బత్తుల భీష్మారావు 41వ వర్ధంతి సభ

భద్రాచలం, నవంబర్ 5, (ప్రజా జ్యోతి): ప్రజా సంక్షేమం, పేద ప్రజల హక్కుల కోసం పోరాడే నాయకులను హత్య చేసినంత మాత్రాన ప్రజా ఉద్యమాలు ఆగవని, అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బి. నర్సారెడ్డి అన్నారు. గురువారం భద్రాచలంలోని చంద్రబాబు నగర్‌లో బత్తుల భీష్మారావు 41వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా భీష్మారావు చిత్రపటానికి 20వ వార్డు సభ్యురాలు ఇర్ఫా, పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యురాలు డి. సీతాలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకురాలు నాదెళ్ల లీలావతి అధ్యక్షతన జరిగిన సభలో నర్సారెడ్డి మాట్లాడుతూ చింతూరు, వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో గిరిజనులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం భీష్మారావు రాజీలేని పోరాటాలు సాగించారని గుర్తుచేశారు. పెత్తందారులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా రైతు, కూలీ ఉద్యమాలను నిర్మించారని తెలిపారు.భద్రాచలం ప్రాంతంలో బండారు చంద్రరావు, బత్తుల భీష్మారావు, చంద్రం, యలమంచి సీతారామయ్యతదితరులు కలిసికమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసి పేదలకు ఎర్రజెండా అండగా నిలిచారని పేర్కొన్నారు.గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రజలను సంఘటితం చేసి హక్కుల కోసం పోరాడిన భీష్మారావు, బండారు చంద్రరావులను హత్య చేశారని ఆరోపించారు.నక్సలైట్ల దాడిలో భీష్మారావు అక్కడికక్కడే మరణించగా, బండారు చంద్రరావు 30 రోజులపాటు మృత్యువుతో పోరాడి ప్రాణాలు విడిచారని గుర్తుచేశారు. అమరవీరులకు నిజమైన నివాళి అర్పించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని నర్సారెడ్డి పిలుపునిచ్చారు. పాతర్లపాడు సామినేని రామారావు హత్య ఘటనపై కూడా కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేస్తూ, బాధ్యులను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా ప్రజా సమస్యలపై పోరాటాలను ఆపబోమని, రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు ఎస్. అజయ్ కుమార్, ధన కొండ రాఘవయ్య, కనకశ్రీ, డి. రామకృష్ణ, రవీందర్, నాగలక్ష్మి, రాధ, రవి తదితరులు పాల్గొన్నారు.

